



స్థానిక సందడి షురూ!

- పల్లెల్లో మొదలైన స్థానిక సందడి
- సన్నద్ధం అవుతున్న ప్రధాన పార్టీలు
- పార్టీ శ్రేణులను అప్రమత్తం చేస్తున్న అధిష్ఠానాలు
- జిల్లాలో పల్లెపోరు అధికార కాంగ్రెస్‌కు సవాలే..
- పావులు కదుపుతున్న బీఆర్ఎస్, బీజేపీలు

కామారెడ్డి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది. సెప్టెంబరు 30లోగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో గ్రామాల్లో స్థానిక సంస్థల సందడి మొదలైంది. రానున్న 30 రోజుల్లో రిజర్వేషన్‌లు ఖరారు చేసి 60 రోజుల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించడంతో ఎన్నికల నిర్వహణ తప్పనిసరి కానుంది. స్థానిక సంస్థల సమరానికి రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఎంపీటీసీ, జడ్పీటీసీ గ్రామ పంచాయతీ ఎన్నికలపై ప్రధాన పార్టీలు దృష్టి పెట్టాయి. ప్రధానంగా గ్రామస్థాయి నేతలు రెట్టింపు ఉత్సాహంతో పోటీకి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రిజర్వేషన్‌లు ఖరారు అయితే తాము ఎక్కడి నుంచి పోటీ చేయాలో తేల్చుకునేందుకు కొందరు నేతలు వేచి చూసే ధోరణిలో ఉన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పార్టీల గుర్తుపై, గ్రామ పంచాయతీ ఎన్నికలు పార్టీల మద్దతుతో స్వతంత్ర గుర్తులపై జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న రాజకీయ పార్టీలు వ్యూహం రచిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులతో సమావేశాలు నిర్వహిస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేస్తుండగా బీజేపీ చాపకింద నీరులా ఎన్నికలకు సిద్ధమవుతోంది. క్షేత్రస్థాయిలో బలం పెంచుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ ఎన్నికలపై దృష్టి సారించింది.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి..

అధికార కాంగ్రెస్ పార్టీ అందరికంటే ముందే స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతోంది. రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి దోహదం చేసిన జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఆధిక్యత ప్రదర్శించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యేలు ఆ పార్టీ ప్రజాప్రతినిధులు నేతలు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండడంతో మండల, గ్రామస్థాయి నాయకులతో ఎన్నికల్లో పని చేయడం సమస్య కాదని భావిస్తున్నారు. ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు ఎన్నికల్లో పోటీకి సై అంటున్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ గ్రామ పంచాయతీ ఇలా ఏదో ఒక ఎన్నికల్లో పోటీ చేయాలని ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో గ్రామస్థాయి పార్టీలో విబేధాలు తలెత్తకుండా జిల్లా నాయకత్వం సమన్వయం చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రణాళికను రూపొందించుకుంటున్నారు. గెలిచే అభ్యర్థులనే బరిలో దింపాలని నేతలు ఆలోచిస్తున్నారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మదన్ మోహన్‌రావు, లక్ష్మీకాంతారావులు స్థానిక సంస్థల ఎన్నికలపై ఆయా నియోజకవర్గంలోని నేతలు, కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ సిద్ధంగా ఉండాలని దిశా నిర్దేశం చేస్తున్నారు.

సత్తా చాటేందుకు సిద్ధమవుతున్న బీఆర్ఎస్

గత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలతో పాటు గ్రామ పంచాయతీల్లోనూ బీఆర్ఎస్ అత్యధిక స్థానాలను గెలుచుకుంది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో పాటు జిల్లాలో కూడా ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. జిల్లాలో ఒక సీటు గెలుచుకున్నప్పటికీ ఆ ఎమ్మెల్యే సైతం కాంగ్రెస్‌లో చేరారు. గత ఎన్నికల వరకు జిల్లాలో బలమైన పార్టీగా ఉన్న బీఆర్ఎస్ ఈ సారి కొంత ఎదురీదుతోంది. ఈ ఎన్నికల్లో పుంజుకోవాలనే ఉద్దేశ్యంతో పార్టీ నాయకత్వం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ నేతలు ఎప్పటికప్పుడు ఎండగడుతూనే ఉన్నారు. పలు సమస్యలపై పోరాటం చేస్తున్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో హామీలను అమలు చేయకపోవడం, కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని ఇదే అంశంపై ప్రజల వద్దకు వెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీఆర్ఎస్ భావిస్తోంది. అదేవిధంగా ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్న ఆశావహులు ప్రయత్నాలు ప్రారంభిస్తున్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యేలు స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

పట్టు సాధించేందుకు బీజేపీ

గత అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల్లో రాష్ట్రంలో పలు సీట్లను సాధించి ఉత్సాహంతో ఉన్న బీజేపీ స్థానిక సంస్థల్లోనూ పట్టు సాధించాలని ఆ పార్టీ ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఎన్నికల్లో తమ ఉనికిని చాటుకునేందుకు బీజేపీ ఆరాటపడుతోంది. ఇప్పటికే జిల్లాలో బీజేపీ నుంచి ఒక ఎమ్మెల్యే ఉండడంతో స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను సాధించాలని తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా ఇది వరకే బీజేపీ బూత్ స్థాయి మొదలుకుని జిల్లా నూతన కమిటీల ఏర్పాటుపై దృష్టి సారిస్తూ కొత్త నాయకత్వాన్ని నియమించింది. జిల్లా వ్యాప్తంగా నాలుగు నియోజకవర్గాల్లో బూత్ స్థాయి కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు గ్రామ, మండల జిల్లా స్థాయి కమిటీలను ప్రకటించారు. నూతన కమిటీలు స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారానికి పోరాటం చేయడం, కాంగ్రెస్ ప్రజావ్యతిరేక కార్యక్రమాలపై ఉద్యమం చేస్తున్నాయి. అదేవిధంగా కేంద్రం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా వైఫల్యం అవుతున్న దానిపై ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలా జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ప్రధాన పార్టీలు గురిపెట్టాయి.



పోచారంలో బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

పోచారంలో ఘనంగా బోనాల పండుగ

నాగిరెడ్డిపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచారం గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ దేవతలకు బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతలు దుర్గమ్మ, నల్ల పోచమ్మ, ఎల్లమ్మ, గంగమ్మ, తదితర గ్రామ దేవతలకు గ్రామస్థులంతా కలిసి బోనాల పండుగ ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆషాఢ మాసం సందర్భంగా ప్రతీ సంవత్సరం నిర్వహించే బోనాల పండుగ ఉత్సవాల్లో భాగంగా గ్రామ దేవతలకు బోనాలు పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలను ఎత్తుకొని గ్రామం నుంచి బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అబివృద్ధి కమిటీ అధ్యక్షులు బాపురావు, సొసైటీ డైరెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, యాదయ్య, గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ నర్సాగౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, కిరణ్, మల్లారెడ్డి, సంగమేశ్వర్, నరసింహారెడ్డి, గ్రామ అబివృద్ధి కమిటీ సభ్యులు, కుల సంఘాల పెద్దలు గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట: మండల కేంద్రంలో ఆషాఢ మాసం సందర్భంగా రజక సంఘం ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. గ్రామంలో అత్యంత భక్తిశ్రద్ధలతో మహిళలు చిన్నారులు సంప్రదాయ వస్త్రాలంకరణలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి దూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ప్రకృతి మధ్యలో సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు బద్రి స్వామి, ఉపాధ్యక్షుడు గడ్డమీది యాదయ్య, సలహాదారుడు నారాయణ, కోశాధికారి తలమడ్ల భూమయ్య, సభ్యులు అంజవ్వ, లావణ్య, శివలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



రాజంపేటలో..

హనుమాన్ ఆలయ హుండీ లెక్కింపు



బీర్కూర్‌లో ఆలయ హుండీని లెక్కిస్తున్న దృశ్యం

బీర్కూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని గాంధీచౌక్‌లో గల హనుమాన్ ఆలయ హుండీ ఆదాయాన్ని ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం లెక్కించారు. హుండీ ఆదాయం రూ.లక్షా 29 వేల 200 వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఆదాయాన్ని ఆలయ అభివృద్ధి పనులకు వినియోగించనున్నట్లు సభ్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవానికి అంతా సిద్ధం

- నాగిరెడ్డిపేటలోని 25 నర్సరీల్లో లక్ష మొక్కలు నాటేందుకు సిద్ధం
- 83 వేల మొక్కలు నాటే లక్ష్యం



7

గంగమ్మ వాగు బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేదెప్పుడు!?

- రామారెడ్డిలో గంగమ్మ వాగు బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలి
- త్వరగా పూర్తి చేయాలని కోరుతున్న ప్రజలు



7

డీఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అమిత్‌షా

- నిజామాబాద్‌లోని బైపాస్ చౌరస్తా వద్ద డి. శ్రీనివాస్ విగ్రహావిష్కరణ
- డీఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉంది
- కేంద్ర హోం మంత్రి అమిత్‌షా



7

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల మోత

- ఆదాయంలో 40 శాతం చదువులకే..
- కాగితాలకే పరిమితమైన గవర్నింగ్‌బాడి
- కనీసం పర్యవేక్షణ చేయని విద్యాశాఖాధికారులు
- పిల్లల చదువులకు తల్లిదండ్రులకు ఆర్థిక ఇక్కట్లు



కామారెడ్డి టౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ, పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య, విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పన కోసం తీసుకువచ్చిన విద్యా హక్కు చట్టం ఎక్కడ అమలు కావడం లేదు. జిల్లాలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ పాఠశాలలు ఈ చట్టాన్ని భేఖాతారు చేస్తున్నాయి. ఫీజులను అడ్డగోలుగా పెంచేస్తున్నా విద్యాధికారులు పట్టించుకోవడం లేదు. విద్యార్థుల కోసమే తాము పని చేస్తామని చెబుతున్నా విద్యార్థి సంఘాలు సైతం పూర్తిస్థాయిలో దృష్టి సారించకపోవడంతో ప్రైవేట్ పాఠశాలలు ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా పుస్తకాలకు, దుస్తులకు వసూళ్లు చేస్తుండడంతో పాటు ప్రీప్రైమరీ పాఠశాలలకే రూ.25 వేల నుంచి రూ.65 వేల వరకు ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం రోజురోజుకూ అధికమవుతోంది. పోనీ విద్యాశాఖాధికారులైనా సరైన దృష్టి సారిస్తున్నారంటే అదీ లేదు. విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే దృష్టి సారిస్తామని మాటలు చెప్పి చేతులు దులుపుకుంటున్నారు. కొన్నిచోట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ముందుకు వచ్చి ఫిర్యాదులు చేస్తే ప్రైవేట్ పాఠశాలలకు ఫిర్యాదుపై స్పందించి ఫిర్యాదును వెనక్కి తీసుకునేలా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ప్రైవేట్ దోపిడీకి అడ్డుకట్ట వేసే వారేరీ?

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించేందుకు ప్రభుత్వం అసలు ఏ నిబంధనలు తీసుకురాలేదని ఏకంగా విద్యాశాఖాధికారులే చెబుతున్నారు. కానీ గవర్నింగ్ బాడీ అనేది ఒకటి ఉంటుందని ఆ కమిటీ నిర్ణయం మేరకు ఫీజులు నిర్ణయించాలనేది మాత్రం ఎక్కడా ప్రస్తావించడం లేదు. కొన్ని పాఠశాలల్లో ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలే తమకు నచ్చిన విద్యార్థుల తల్లిదండ్రుల పేర్లతో కమిటీ ఏర్పాటు చేసి

(మిగతా 8వ పేజీలో)

పుట్ట గొడుగుల్లా..
సీడ్స్, ఫర్టిలైజర్ షాపులు!

- అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ఏర్పాటు
- రైతులకు అంటగడుతున్న నకిలీ విత్తనాలు, ఎరువులు
- కొరవడిన వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ



ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

ఎల్లారెడ్డి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలోని వివిధ మండలాలతో పాటు పరిసర గ్రామాల్లో సీడ్స్ ఫర్టిలైజర్స్ షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వానాకాలం సీజన్ మొదలు కావడంతో అన్నదాతలు స్థానికంగా ఉన్న సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ షాపులకు వెళ్లి వరి, మొక్కజొన్న, పత్తి విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. రైతుల అమాయకత్వానికి ఆసరా చేసుకుని షాపుల నిర్వాహకులు దిగుబడి బాగా వస్తుందని కంపెనీలు ఇచ్చే ఆఫర్లు, లాభాలు బాగా వచ్చే విత్తనాలను దీనికి తోడు పంటల తెగుళ్లకు నివారణకు దుకాణాల నిర్వాహకులు రైతులకు ఇష్టం వచ్చిన పెస్టిసైడ్స్ ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కామారెడ్డి జిల్లాలోని 24 మండలాల్లో 526 గ్రామాలు ఉన్నాయి. జిల్లాలో 3,16,560 లక్షల మంది రైతులు ఉన్నారు. 5,14,290 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న మండలాల్లోని పలు గ్రామాల్లో అనుమతులు లేకున్నా సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ షాపులు విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నాయి. గత కొంత కాలంగా నకిలీ విత్తనాలు, ఎరువులకు సంబంధించి ఫిర్యాదులు వస్తున్నా వ్యవసాయ శాఖ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదని పలువురు రైతుల నుంచి పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కానీ అప్పుడప్పుడు తనిఖీలు చేపడుతూ ఫొటోలకు ఫోజులిస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

డీలర్లకు కంపెనీల ఆఫర్లు

పలు సీడ్స్ పెస్టిసైడ్స్ కంపెనీలు డీలర్లకు విదేశీ టూర్లు, ప్రత్యేక ప్యాకేజీల ఆఫర్లు ఇస్తుండటంతో ఆ కంపెనీలకు చెందిన విత్తనాలు పెస్టిసైడ్స్‌ను రైతులకు మాయ మాటలు చెప్పి విక్రయిస్తున్నారు. ఎక్కువగా టార్గెట్ పూర్తి చేసిన డీలర్లకు జల్సాల కోసం పలు కంపెనీలు టూర్లకు పంపిస్తున్నాయి. కానీ నకిలీ విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు మాత్రం పంట దిగుబడి రాక తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ క్రమంలో అప్పులు ఎక్కువ. రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సందర్భాలు ఉన్నాయి.

ఈ అనుమతులు తప్పనిసరి

- ఫర్టిలైజర్‌కు ఆన్‌లైన్, పెస్టిసైడ్స్‌కు మాన్యువల్‌గా దరఖాస్తులు చేసుకోవాలి.
- ఫర్టిలైజర్స్‌కు ఏడీఏ, సీడ్స్, పెస్టిసైడ్స్‌కు జిల్లా వ్యవసాయ అధికారి అనుమతులు ఇస్తారు.
- పెస్టిసైడ్స్‌కు బీఎస్సీ సైన్స్, సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్‌కు డిప్లొమా అగ్రికల్చర్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి.
- షాపుల నిర్వాహకులకు అర్హతలు లేకపోతే సర్టిఫికెట్ కలిగిన వ్యక్తులను టెక్నికల్ పర్సన్స్‌గా పెట్టుకోవాలి.
- పెస్టిసైడ్స్‌కు లైఫ్ టైం అనుమతి కాగా ఫర్టిలైజర్స్‌కు ఐదేళ్లు, సీడ్స్‌కు ఐదేళ్ల వరకు అనుమతి ఉంటుంది.

అన్నివర్గాల అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి



బీరప్ప ఆలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

భిక్కనూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. ఆదివారం భిక్కనూరు మండల కేంద్రంతో పాటుగా మండలంలోని సిద్ధరామేశ్వర నగర్, గుర్జకుంట, ర్యాగట్లపల్లి గ్రామాల్లో పలు దేవాలయాలతో పాటుగా అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో ప్రభుత్వ నిధులతో పాటుగా తన సొంత నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. తాను మాటల మనిషిని కాదని చేతల మనిషినని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలుకగా ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రమేష్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల కుల సంఘాల ప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను ఎండగట్టాలి

రాష్ట్ర బీఆర్ఎస్ యువజన నాయకుడు గంప శశాంక్



మాట్లాడుతున్న గంప శశాంక్

మాచారెడ్డి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను ఎండగట్టాలని రాష్ట్ర బీఆర్ఎస్ యువజన నాయకుడు గంప శశాంక్ అన్నారు. ఆదివారం పాల్వంచ మండల కేంద్రంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎలక్షన్‌లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను, 420 హామీలను గ్రామాల్లో ఉన్న ప్రజలకు వివరిస్తూ చైతన్యం చేయాలని, వచ్చే స్థానిక సమరానికి పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. తెలంగాణ ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్‌ను బొందపెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల యువజన ఇన్‌చార్జి లస్కర్ నాయక్, మాచారెడ్డి యువజన అధ్యక్షుడు దేవరాజ్, గ్రామాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈటెలకు స్వాగతం పలికిన నాయకులు


ఈటెలకు ఘన స్వాగతం పలుకుతున్న ముదిరాజ్ నాయకులు

నిజామాబాద్ అర్బన్, జూన్29(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పట్టణంలో ఆదివారం జరిగిన పసుపుబోర్డు కార్యాలయం ప్రారంభోత్సవానికి విచ్చేసిన మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్‌ను జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు యాసాడ నర్సింగ్ ముదిరాజ్ జిల్లా కేంద్రంలోని లహరి హోటల్ వద్ద ఆయనకు ఘనస్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాబోయే తెలంగాణ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఈటెల రాజేందర్ అని, రానున్న కాలంలో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దాదాపు 150 మంది ఈటెల రాజేందర్‌కు ఘనస్వాగతం పలికారు. ఘనస్వాగతం పలికిన వారిలో సంజీవ్‌రెడ్డి, మనోహర్, మద్దెల మురళి, సంజీవ్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అనీల్‌కుమార్, సుమన్, శీల శ్రీనివాస్, జిల్లా నాయకులు తదితరులు ఉన్నారు.

జీపీ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులు

మోర్తాడ్,జూన్29(ఆంధ్రజ్యోతి): జీపీ యూనియన్ నూతన మండల కమిటీని సీఐటీయూ జిల్లా నాయకుడు నన్నేసాబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్‌హకీం, ప్రధాన కార్యదర్శిగా వంశీ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అంజనేయులు, కోశాధికారిగా రాము, ఉపాధ్యక్షుడిగా లింగం, సహాయ కార్యదర్శిగా నాగేష్, కార్యవర్గ సభ్యులుగా శ్రావణ్ కుమార్, రాంబాబు, రమేష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కమిటీ సభ్యులు రాజీలేని పోరాటం చేయాలని నన్నేసాబ్ సూచించారు.

బోధన్‌లో ఘనంగా బోనాల పండుగ


బోధన్‌లో బోనాలను తీసుకెళ్తున్న మహిళలు

బోధన్‌రూరల్,జూన్29(ఆంధ్రజ్యోతి): ఆదివారం బోధన్ పట్టణంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో బోనాల పండుగను డప్పువాయిద్యాలతో ఘనంగా నిర్వహించారు. బోనాలతో మహిళలు మహాలక్ష్మి ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ఒడి బియ్యం నింపి మొక్కులు చెల్లించుకున్నారు. సకాలంలో వర్షాలు కురియాలని, పాడిపంటలు సమృద్ధిగా కురియాలని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుల సంఘాల నాయకులు, మాజీ శివాలయం కమిటీ చైర్మన్ బీర్కూర్ బుజ్జి, శ్రీను, శంకర్, భూమేష్, సురేందర్, సాయన్న, వీరేందర్, అజయ్, రాజు, శేఖర్, శ్యామ్, సింగం లక్ష్మణ్, రమేష్‌లతో మహిళలు, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని బినోలలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు.ఆషాడ మాసం ఆదివారం సందర్భంగా భక్తులు తలపై బోనాలను ఎత్తుకుని స్థానిక నల్లపోచమ్మ ఆలయానికి తరలివెళ్లారు.ఈ సందర్భంగా పాడిపంటలు చల్లగా ఉండాలని కోరుతూ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.ఈకార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఎడపల్లి: ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ క్యాంపు గ్రామంలో ఆదివారం బోనాల పండుగను గ్రామ మాల కులస్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మాల కులస్థుల ప్రతి ఇంటి నుండి బోనాలు తీసి భాజా భజంత్రీలతో గ్రామంలో ఊరేగింపుగా వెళ్ళి గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాల కులస్థులతో పాటు గ్రామస్థులు తదితరలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


గురువులతో పూర్వవిద్యార్థులు

ఆర్మూర్ టౌన్, జూన్29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని ఎంఆర్ గార్డెన్‌లో ప్రజ్ఞ హైస్కూల్‌కు చెందిన 2007-08 బ్యాచ్‌కు సంబంధించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అప్పటి గురువులను పట్టు శాలువ, పూల మాలతో ఘనంగా సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. తమ విద్యార్థి దశ జ్ఞాపకాలను నెమరువేసుకుంటు ప్రస్తుతం చేస్తున్న పనులను ఒకరికొకరు తెలుపుకున్నారు.

మొరం వేసిన అధికారులు

- హర్షం వ్యక్తం చేసిన కాలనీవాసులు



అంగన్‌వాడీ స్కూల్ వద్ద మొరం వేయిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,జూన్29(ఆంధ్రజ్యోతి): బురద రోడ్డు మొరం రోడ్డు అయింది. ఆంధ్రజ్యోతి దినపత్రికలో శనివారం ప్రచురితమైన రోడ్డంత బురద బురద కథనానికి ఎమ్మెల్యే, అధికారులు స్పందించారు. శనివారం బురద రోడ్డును పరిశీలించడమే కాకుండా ఆదివారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆగమేఘాల మీదు అధికార యంత్రాంగం బురదగా ఉన్న రోడ్డును మొరం రోడ్డుగా మార్చేశారు. ఎమ్మెల్యే ఆదేశాలు పాటించిన అధికారుల తీరును పలువురు ప్రశంసిస్తున్నారు. రోడ్డంత బురద బురద, గర్భిణీలు, బాలింతల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు బురదగా ఉన్న రోడ్డును మొరం రోడ్డుగా మార్చి వేయడంతో స్థానిక కాలనీవాసులు, అంగన్‌వాడీ చిన్నారుల తల్లి దండ్రులు, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణీ స్త్రీలు, బాలింతలు, యూపీపీఎస్ ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థులు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు, ఉర్దూ మీడియం పాఠశాలలకు వెళ్లాలంటే బురదలో నడవాల్సి వస్తుండే వారని ఇక ఇబ్బందులు తొలగిపోయ్యాయని కాలనీవాసులు, అంగన్‌వాడీ టీచర్లు, ఉర్దూ మీడియం పాఠశాల ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బురదగా ఉన్న రోడ్డుపై మొరం రోడ్డు వేస్తూ ట్రాక్టర్ బ్లేడ్‌తో సాఫీగా చదును చేసి బురదగా ఉన్న రోడ్డును మొరం రోడ్డుగా మార్చేశారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

పలు చోట్ల గ్రామదేవతలకు జలాభిషేకం


డొంకేశ్వర్‌లో గ్రామదేవతలకు జలాభిషేకం చేస్తున్న గ్రామస్థులు


కొత్తపల్లిలో వలగొడుగుతో..


సుంకెట్‌లో..


ఆలూర్‌లో..


పడిగెలలో ..

డొంకేశ్వర్, జూన్29 (ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మండల కేంద్రంలో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవతకు జలాభిషేకం నిర్వహించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ గోదావరితీరం నుంచి పవిత్ర గంగాజలాన్నితెచ్చిడప్పు వాయిద్యాలు, వలగొడుగులతో ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి గ్రామంలోని దేవతామూర్తులకు జలాభిషేకం నిర్వహించి పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని దేవుళ్లను కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీ క్యాషియర్ కల్లెం మహిపాల్, మేకల సుమన్, వీడీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో ప్రజలు చల్లగా ఉండాలని గ్రామదేవతలను వేడుకుంటు గంగనీళ్లతో ఆదివారం గ్రామదేవతలకు అభిషేకం చేశారు.ముప్కాల్ మండల కేంద్రంతో పాటు కొత్తపల్లి, రెంజర్ల గ్రామాలలో గోదావరినుంచి గంగజాలలను తెచ్చి గ్రామ పొలిమేర నుంచి వలగొడుగుతో, డప్పువాయిద్యాలతో ద్యావతిమంత్రోచ్చరణల మధ్య మంగళహారతులతో గంగజలాలను ప్రధాన వీధుల గుండావెళ్లి గ్రామదేవతలకు జలాభిషేకంచేసి,పసుపు,కుంకమ, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలోని ప్రజలు సంఖసంతోషాలతో ఉండి వర్షాలు బాగా పండాలని మొక్కుకున్నారు.అనంతరం కుటుంబాలతో కలిసి వనభోజనాలు చేశారు.

మోర్తాడ్:మండలంలోని సుంకెట్‌గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్ని కులాల సభ్యులు వర్షాల కోసం గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. ఆదివారం ఉదయం నుండి గ్రామంలో ప్రజలు బోనాలు, వలగొడుగుతో ఊరేగింపుగా వెళ్ళి గ్రామ దేవతలకు జలాభిషేకాలు చేసి పూజలు నిర్వహించారు. అన్ని దేవాలయాలలో పూజలు నిర్వహించారు. గంగపుత్రులు వలగొడుతో ఊరేగింపు నిర్వహిస్తు దేవాలయాలలోని విగ్ర హాలకు గంగనీటితో జలాభిషేకం చేశారు. వర్షాలు కురువాలని మహిళలు అధిక సంఖ్యలో బోనాలతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలూర్:ఆలూర్ మండలంలోని మిర్దాపల్లిలో ఆదివారం గ్రామదేవతలకు జలాభిషేకం నిర్వహించారు. గోదావరి నుంచి గంగజాలాలను తీసుకువచ్చి గ్రామంలోని దేవతామూర్తులకు జలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో, ఆలూర్ మండల కేంద్రంలో ఆదివారం గ్రామ దేవతలకు జలాభి షేకం నిర్వహించారు. గోదావరి తీరం నుంచి గంగజలాలు తీసుకువచ్చి వలగొడుగులతో, డప్పువాయిద్యాలతో గ్రామంలో ఊరేగించారు. అనంతరం గ్రామంలోని దేవతామూర్తులకు జలాభిషేకం చేశారు. వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా కురవాలని, ప్రజలందు ఆరోగ్యంగా సిరి సంపదలతో వర్ధిల్లాలని గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు భార్ల ముత్యం, నవనీత్, సునీల్, రాములు, మల్లేష్, కేశ్‌పల్లి గంగారెడ్డి, భాస్కర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: వేల్పూర్ మండలం పడిగెల గ్రామంలో ఆదివారం గ్రామ దేవతలకు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. స్థానిక రామాలయం నుంచి గ్రామ దేవతలకు నైవేద్యాలతో ప్రధాన వీధుల గుండా డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవత లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు భాగా కురవాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామాప్రజలు సుఖసంతోషాలతో ఉండా లని పెద్దపోచమ్మ,ముత్యాలమ్మ,తాతాయి, ఐదుచేతుల పోచమ్మ దేవత లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామస్థులు వనబోజనాల కార్యక్రమం చేపట్టారు.

నేడు నవీపేటలో బోధన్ ఎమ్మెల్యే పర్యటన

నవీపేట,జూన్29(ఆంధ్రజ్యోతి): బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సోమవారం నవీపేటలో పర్యటించనున్నారని మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు భగవాన్‌లు తెలిపారు. ఉదయం 10గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేయడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హజరుకావాలని వారు కోరారు.

ఎడపల్లిలో యువకుడిపై కేసు నమోదు

ఎడపల్లి, జూన్29(ఆంధ్రజ్యోతి):ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన షేక్‌ముజాహిద్ అనే యవకుడిపై పోక్సోకేసు నమోదు అయినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ బాలిక రెండేళ్ల క్రితం ఎడపల్లిలో గల తన అమ్మమ్మ ఇంటికి తరచూ వచ్చేదన్నారు. అలా వచ్చిన సమయంలో గ్రామంలోని ఓ టైలర్ వద్ద బట్టలు కుట్టించడానికి వెళ్లిన సమయంలో అక్కడే ఉన్న టైలర్ మేనల్లుడు ముజాహిద్ బాలిక ఫోన్ నంబరు తీసుకుని పరిచయం ఏర్పరుచుకున్నాడన్నారు. అలా ఫోన్‌లో మాటలు కలిపి బాలికను శారీరకంగా వాడుకుని మోసం చేశాడని బాలిక తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పొతంగల్‌లో మన్‌కీ బాత్ వీక్షణ


పొతంగల్‌లో ప్రధాని మన్‌కీ బాత్ వీక్షిస్తున్న నాయకులు

కోటగిరి,జూన్29(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల కేంద్రంలోని బీజేపీ నాయకులు సూదం అశోక్ ఇంట్లో ఆదివారం ప్రధాని నరేంద్ర మోడీ 123 వ మన్‌కీ బాత్ ప్రోగ్రామ్‌ను వీక్షించారు. దేశ అభివృద్ధికి చేపడుతున్న చర్యలను ప్రధాని వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హన్మాండ్లు, మక్కయ్య, నాగం సాయిలు, శంకర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రమదానం


ఆలయ ఆవరణలో శ్రమదానం చేస్తున్న సంస్థ సభ్యులు

ఆర్మూర్ రూరల్, జూన్29 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధి మామిడిపల్లి వెంకటేశ్వర్ కాలనీలోని శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో ఆదివారం ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణ, పరిసర ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించి శుభ్రం చేశారు. ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కాలనీవాసులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, ఆలయ కమిటి అధ్యక్షుడు గడ్డం సంజీవరెడ్డి, శ్రావణ్, బోజన్న, స్వచ్ఛంద సంస్థ సభ్యులు ప్రశాంత్, సుంకె నిశాంత్, గణేష్, నూకల ఆదిత్య, రాజ్‌కుమార్, రాజయ్య, నరేష్, మధుసుధన్, శ్యాంసుందర్; కృషి వర్ధన్, బాశెట్టి పెద్ద గంగారాం , ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

మురికి కూపంగా డీ50 ప్రధానకాలువ


ముళ్లపొదలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన ప్రధానకాలువ

- ప్లాస్టిక్, చెత్తచెదారంతో నిండిన వైనం
- వ్యర్థాలను తొలగించాలని రైతుల విన్నపం

నవీపేట,జూన్29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అలీసాగర్ డీ-50 ప్రధాన కాలువ ప్లాస్టిక్ వ్యర్థాలు, ముళ్లపొదలు, చెత్తాచెదారంతో నిండిపోయింది. పాత బస్టాండ్ సమీపం నుంచి బాసర రోడ్డు మూలమలుపు వరకు ప్రధాన కాలువ పరిస్థితి అధ్వానంగా మారింది. పలువురు హోటల్ నిర్వాహకులు ప్లాస్టిక్ గ్లాస్‌లు, ఇతర వస్తువులను కాలువలో పడేస్తుండగా చికెన్ దుకాణదారులు చికెన్ వ్యర్థాలను సైతం కాలువలో పడేస్తున్నారు. కొందరు స్థానికులు తమ ఇళ్లలో ఉన్న పనికిరాని వస్తువులు, చెత్తచెదారంతో పాటు బీడీ ఆకులను సైతం కాలువలో పడేస్తున్నారు. దీనికి తోడు గతంలో గ్రామ పంచాయతీ పాలకులు డ్రైనేజీని సైతం ప్రధాన కాలువలో కలపడంతో పూర్తిగా దుర్గంధంగా మారింది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 20 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే ప్రధానకాలువ పూర్తిగా మురికికూపంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో అలీసాగర్‌ఎత్తిపోతల పథకం ద్వారా ఆయకట్టుకు నీటి విడుదల చేయకముందే కాలువ పూడికతీత చేపట్టి చెత్తచెదారంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని రైతులు కోరుతున్నారు. కాలువ పూడికతీత పనులను వెంటనే చేపట్టి, చివరాయకట్టుకు సాగునీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులను కోరుతున్నారు.


దుర్గంధంగా మారిన ప్రధాన కాలువ

ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రులకు వినతి


మంత్రి సీతక్కను నిధులు కేటాయించాలని కోరుతున్న వినయ్‌రెడ్డి

ఆర్మూర్ రూరల్ , జూన్29 (ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో అభివృద్ధి పనుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ పంచాయితీశాఖ మంత్రి సీతక్క, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు ఆదివారం ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వినయ్‌రెడ్డి విన్నవించారు.కేంద్రహోంశాఖా మంత్రి అమిత్ షా నిజామాబాద్‌కు విచ్చేసిన సందర్భంగా జిల్లాకు వచ్చిన మంత్రులను వినయ్‌రెడ్డి కలిసి నియోజకవర్గ సమస్యలను విన్నవించి నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం మంత్రులను ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రామ్‌రెడ్డి, భూపేందర్, రవికాంత్‌రెడ్డి, అనిల్ రావు, తదితరులున్నారు.

బోధన్‌రూరల్: జిల్లా ఇన్‌చార్జి మంత్రి, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను ఆదివారం బోధన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ తో పాటు పాషా మొయినోద్దీన్, శరత్ రెడ్డి, దాములతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా బోధన్ రాజకీయ అంశాలపై చర్చించామని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ తెలిపారు.

కమ్మర్‌పల్లి: ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, పంచాయితిరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీశిశుసంక్షేమ శాఖల మంత్రి ధన్సరి సీతక్కను కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ పాలెపు నర్సయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు పూలబొకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సీతక్కను కలిసిన వారిలో ఆయనతో పాటు పలువురు కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.


జిల్లా ఇన్‌చార్జిమంత్రి సీతక్కను కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

గురుకుల పాఠశాలల్లో 6, 7, 8 తరగతులలో ఉన్న ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఎడపల్లి,జూన్29(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో 6,7,8 తరగతులలో ఉన్న ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని ఎడపల్లి బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్,నిజామాబాద్ గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ ఎస్. గంగాశంకర్ అన్నారు. ఆదివారం ఓప్రకటనలో ఆయన తెలుపుతూ జిల్లాలో ఉన్న ఆయా గురుకల పాఠశాలల్లో జూలై 4వ తేదీన రాత పరీక్ష నిర్వహించడం జరుగుతుందని ఉదయం 11 గంటల నుంచి మధ్యా హ్నం ఒంటి గంట వరకు నిర్వ హించడం జరుగు తుందని అన్నారు. అర్హులైన విద్యార్థులు ఆయా పాఠశాలల్లో నేటి నుంచి జూలై 2వ తేదీ వరకు దర ఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గ్రామ దేవతలకు పూజలు


గోదావరి నది గంగా జలాలను తీసుకువస్తున్న బుస్సాపూర్ గ్రామ ప్రజలు

మెండోర, జూన్29 (ఆంధ్రజ్యోతి): వానమ్మా.... వానమ్మా ఒక్కసారైనా వచ్చి పోవమ్మా అంటూ నిజామాబాద్ జిల్లా మెండోర, బుస్సాపూర్ గ్రామ ప్రజలు పవిత్ర పుణ్యక్షేత్రం గోదావరి నది నుంచి కాలీ నడకన వెళ్లి డప్పు సప్పులతో వల గొడుగు, మంగళహారతులతో శివసత్తుల పునాకలు పోత రాజుల విన్యాసాలతో గంగ జలాలను తీసుకువచ్చి గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్‌లో రైతన్నలు వ్యవసాయ భూముల్లో పసుపు, మొక్కజొన్న , సోయా పంటలు పెట్టినప్పటికీ నేటికి వర్షాలు కురియకపోవడంతో రైతన్నలు సోయా, మొక్కజొన్న ఉన్న ఒక్క పసుపు పంటను వరుణ దేవుడు కాపాడాలని గ్రామ దేవతలకు గోదావరి నదినుండి గంగ జలాలను తీసుకువచ్చి దేవతలకు జలాభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటి సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆమ్‌ఆద్మీ పార్టీలో పలువురి చేరిక

ఆర్మూర్ టౌన్, జూన్29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పలువురు ఆమ్‌ఆద్మీ పార్టీలో చేరినట్లు నియోజకవర్గ ఇంచార్జి సయ్యద్ అవేజ్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని వివిధ పార్టీలకు చెందిన మహమ్మద్ ముఖ్తార్, కట్టడి కృష్ణ, సూఫీయాన్, సాయిలు పార్టీలో చేరగా నియోజకవర్గ ఇంచార్జి అవేజ్ వారికి పార్టీ కండువా వేసి సాధారణంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు అబ్దుల్ రహ్మాన్, మహ్మద్ రజాక్, అల్జాపూర్ గంగామణి, సాయితేజ, తదితరులు పాల్గొన్నారు.


ఆమ్‌ఆద్మీ పార్టీలో చేరిన వివిధ పార్టీల నాయకులు

'ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి సునీల్‌రెడ్డికి లేదు'


సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్‌లు

వేల్పూర్, జూన్29 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ నియోజకవర్గ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని, నియోజకవర్గంలోని సొసైటీ చైర్మన్‌లను విమర్శించే అర్హత సునీల్‌రెడ్డికి లేదని నియోజకవర్గంలోని పీఏసీఎస్ చైర్మన్‌లు అన్నారు. ఆదివారం వేల్పూర్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత 20 సంవత్సరాల కాలంలో సొసైటీలు ఏ ప్రభుత్వం అధికారంలో ఉండగా నిధులు దుర్వినియోగం, అవకతవకలు జరిగాయే అధికారుల చేత విచారణ జరుపాలని సునీల్‌రెడ్డికి వారు సూచించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో గత మూడు, నాలుగు సంవత్సరాల నుంచి ఐసీడీఎంఎస్ ద్వారా తగినంత యూరియా సొసైటీలకు ఇప్పించిన ఘనత ప్రశాంత్‌రెడ్డిదే నన్నారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి, మోర్తాడ్, రామన్నపేట్, పడిగెల్, మోతె సొసైటీ చైర్మన్‌లు రేగుంట దేవేందర్, బద్దం అశోక్, జే. మోహన్‌రెడ్డి, యాల్ల హన్మంతు, మోతే రాజేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు రేగుల్ల రాములు, ప్రతాప్‌రెడ్డి, డొల్ల రాజేశ్వర్, రమేష్, శేఖర్, సుభాష్, రాము, అశోక్, తదితరులున్నారు.


అభివాదం చేస్తున్న హోంమంత్రి అమిత్‌షా


హోంమంత్రి అమిత్‌షాకు జ్ఞాపికను అందజేస్తున్న ఎంపీ అర్వింద్


సభకు వచ్చిన జన సందోహం



అభిమానం చాటుకుంటున్న బాలుడు

పసుపు రైతుల కలను నిజం చేశాం

● కిసాన్ సమ్మేళనం సభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ● రాష్ట్రంలో బీజేపీకి అధికారం ఇవ్వండి: కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్
● బండి సంజయ్ స్పీచ్‌తో కార్యకర్తల్లో ఉత్సాహం ● 40 ఏళ్ల కలను నిజం చేసిన ఘనత ప్రధాని మోదీది: ఎంపీ ధర్మపురి అర్వింద్

నిజామాబాద్ అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పసుపు రైతుల కలను నిజం చేసిన ఘనత కేంద్ర ప్రభుత్వానిదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. పాలిటెక్నిక్ మైదానంలో జరిగిన కిసాన్ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో పసుపు సాగవుతున్నా తెలంగాణపై ప్రేమతో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలు నిజామాబాద్‌లో పసుపు బోర్డు కేంద్ర కార్యాలయాన్ని ఏర్పాటు చేశారన్నారు. కేంద్రం లోని మోదీ ప్రభుత్వం రైతు పక్షపాతి అని ఈ ప్రాంత రైతులకు కేంద్రం అండగా ఉంటుందన్నారు. రైతులకు ఎరువులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటుందని ఇందు కోసం కేంద్రం రామగుండంలో ఎరువుల ఫ్యాక్టరీని ప్రారంభించిందన్నారు. విద్యుత్ కోతలు లేకుండా చూస్తున్న ఘనత కేంద్రానిది అని ఆయన అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీ రాష్ట్రానికి చేస్తున్న అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని అన్నారు. గతంలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పసుపు బోర్డు ఎందుకు తీసుకురాలేదో జవాబు చెప్పాలన్నారు. సంవత్సరానికి రైతులకు సహాయంగా పీఎం కిసాన్ యోజన కింద 6వేలు అందిస్తున్న ఘనత కేంద్ర ప్రభుత్వానిది అన్నారు. తెలంగాణ రైతాంగానికి కేంద్రం అండగా ఉంటుందని పసుపు బోర్డు ఏర్పాటు చేసిన ప్రధాని మోదీ, అమిత్‌షాలకు తెలంగాణ రైతాంగం తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

అందరికీ అవకాశం ఇచ్చారు .. బీజేపీకి ఇవ్వండి అధికారం..

● కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

తెలంగాణ ప్రజలు అందరికీ అవకాశం ఇచ్చారని ఈ సారి బీజేపీకి అధికారం ఇవ్వాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. నిజామాబాద్ జిల్లా ప్రజలు గొప్ప వాళ్లని ఎన్నో ఏళ్లుగా కొట్లాడుతున్న పసుపు బోర్డును ఢిల్లీలో కొట్లాడి మరీ సాధించారని అన్నారు. ఇందూరు రైతులు హీరోలు అని పసుపు రైతులు చేసిన ఉద్యమం మామూలు ఉద్యమం కాదన్నారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురిని అందరూ పసుపు అర్వింద్ అంటున్నారని ఆయన అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని రైతును రాజును చేయాలనేది గత నినాదం అని కానీ రైతును రారాజు మహారాజును చేయాలనేది మోదీ ప్రభుత్వ నినాదం అన్నారు.

40 ఏళ్ల కలను నిజం చేసిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు: ఎంపీ అర్వింద్ ధర్మపురి

నిజామాబాద్ ప్రాంత ప్రజలు పసుపు బోర్డు కోసం 40 ఏళ్లుగా కన్న కలలను నిజం చేసిన ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షాలకు ఎంపీ అర్వింద్ ధర్మపురి ధన్యవాదాలు తెలిపారు. తాను పాలిటెక్నిక్ మైదానంలో జరిగిన కార్యక్రమం ద్వారానే బీజేపీలో చేరానని ఇప్పుడు పసుపు బోర్డు సభ ఇదే వేదికపై జరగడం తన అదృష్టం అన్నారు. ఇక్కడి రైతుల పరిస్థితిని చూసే ఎన్నికల్లో హామీ ఇచ్చాము. రైతులు మద్దతు ఇచ్చారు. ప్రధాని మోదీ ఇచ్చిన హామీని నెరవేర్చారు. రైతులకు అండగా నిలబడ్డారు. పసుపు బోర్డు ఇచ్చి నిజామాబాద్ రైతులకు మేలు చేశారు. ఈ బోర్డు ద్వారా ఇక్కడి రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని ఆయన అన్నారు.


సభకు తరలివస్తున్న పసుపు రైతులు

● ధన్యవాదాలు తెలిపిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి

నిజామాబాద్ జిల్లా కేంద్రానికి కేంద్ర పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించేందుకు వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు జిల్లా బీజేపీ అధ్యక్షుడు దినేష్ కులాచారి ధన్యవాదాలు తెలిపారు. పాలిటెక్నిక్ మైదానంలో జరిగిన సభలో దినేష్‌కులాచారి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఉదయం నుంచి ఆయన సభను అన్ని తానై నడి పించారు.

డీఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా


డీఎస్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా


ఆవిష్కరణ తర్వాత అభివాదం చేస్తూ..

నిజామాబాద్ అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు ధర్మపురి శ్రీనివాస్ కాంస్య విగ్రహాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదివారం ఆవిష్కరించారు. జాతీయ పసుపు బోర్డు కేంద్ర కార్యాలయాన్ని ప్రారంభించేందుకు నగరానికి వచ్చి న ఆయన కంఠేశ్వర్‌లోని బైపాస్ చౌరస్తాలో డీఎస్ తనయుడు, ఎంపీ ధర్మపురి అర్వింద్ సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన డీఎస్ విగ్రహాన్ని హోంమంత్రి అమిత్‌షా చేతుల మీదుగా ఆవిష్కరించారు. డీఎస్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని 44 లక్షల వ్యయంతో 14 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆయన తనయుడు అర్వింద్ ఏర్పాటు చేశాడు. అనంతరం జరిగిన కిసాన్ సమ్మేళనంలో సైతం అమిత్‌షా తన ప్రసంగంలో డీఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్‌రెడ్డి, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, డీఎస్ సోదరులు ధర్మపురి సురేందర్, ధర్మపురి ప్రకాశ్ పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రి పర్యటన సైడ్‌లైట్స్

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పర్యటన ఆదివారం నగరంలో ఆద్యంతం ఆసక్తిగా జరిగింది.

● మధ్యాహ్నం 2.15 నిమిషాలకు జిల్లా కలెక్టరేట్ లోని హెలిప్యాడ్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హెలిక్యాప్టర్ లాండ్ అయ్యింది.

● కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ అర్వింద్, కలెక్టర్, సీపీలు ఆయనకు స్వాగతం పలికారు.

● 2.25 నిమిషాలకు వినాయక్‌నగర్‌లో కేంద్ర పసుపు బోర్డు కార్యాలయాన్ని అమిత్‌షా ప్రారంభించారు.

● 2.35నిమిషాలకు బస్వాగార్డెన్‌కు వచ్చారు.

● 3.15 నిమిషాలకు బస్వాగార్డెన్ నుంచి కంఠేశ్వర్ బయలుదేరారు.

● 3.25 నిమిషాలకు బైపాస్ చౌరస్తాలో డీఎస్ విగ్ర హాన్ని ఆవిష్కరించారు.

● 3.35 నిమిషాలకు పాలిటెక్నిక్‌లో బహిరంగ సభ వేదికపైకి వచ్చారు.

● 3.50 నిమిషాలకు ప్రసంగాన్ని ప్రారంభించారు.

● 4.08 నిమిషాలకు ప్రసంగం ముగించారు.

● 4.20 నిమిషాలకు నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు.

● పాలిటెక్నిక్ మైదానంలో నిర్వహించిన కిసాన్ సమ్మేళనానికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పసుపు రంగు చీరలతో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కొంత మంది మహిళలు బోనాలతో నృత్యాలు చేస్తూ హాజరయ్యారు.

● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రసంగం ప్రారంభించేటప్పుడు కార్యకర్తలు సందడి చేశారు. కార్యకర్తల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించడంతో హోంమంత్రి అమిత్‌షా సైతం ఆసక్తిగా ప్రసంగాన్ని విన్నారు.

● జిల్లా పర్యటనకు వచ్చిన హోంమంత్రి అమిత్‌షాను ఎంపీ అర్వింద్ ధర్మపురి, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డిలు ఘనంగా సన్మానించారు.

● కేంద్ర హోం మంత్రి పర్యటన సందర్భంగా పోలీసు బందోబస్తును పోలీస్ కమీషనర్ సాయిచైతన్య, కామారెడ్డి అడిషనల్ ఎస్పీ చైతన్యరెడ్డిలు పాలిటెక్నిక్ మైదానంలో జరిగిన కిసాన్ సమ్మేళనంలో దగ్గరుండి పర్యవేక్షించారు.

● ఎన్‌సీసీ క్యాడెట్ల నిరసన...

పాలిటెక్నిక్ మైదానంలో జరిగిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కిసాన్ సమ్మేళనం కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్లు ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. అమిత్‌షా ప్రసంగిస్తున్న సమయంలో ఎన్‌సీసీ క్యాడెట్లు ప్లకార్డులను ప్రదర్శించడం చర్చనీయాంశమైంది. ఎంబీబీఎస్‌లో ఒక్క శాతం ఎన్‌సీసీ కోటా రిజర్వేషన్‌ను గతంలో తీసే శారని తిరిగి రిజర్వేషన్ కల్పించాలంటూ ఎన్‌సీసీ క్యాడెట్లు ప్లకార్డులను ప్రదర్శించారు. పోలీసులు వారిని బయటకు పంపారు. ఎన్‌సీసీ క్యాడెట్లు ఇద్దరు వరంగల్ నుంచి వచ్చినట్లు తెలిసింది.

మినీ ట్యాంక్ బండ్
సుందరీకరణ పనుల్లో నాణ్యతా లోపం

● పట్టించుకోని అధికారులు ● ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు


పనులను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు (ఫైల్)


ఇనుప రెయిలింగ్‌కు జాయింటింగ్ చేసిన దృశ్యం

ఆర్మూర్ టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గూండ్ల చెరువు వద్ద చేపడుతున్న మినీ ట్యాంక్ బండ్ సుందరీకరణ పనుల్లో నాణ్యతా లోపం కనిపిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం గూండ్ల చెరువు మినీ ట్యాంక్‌బండ్ సుందరీకరణ చేపట్టడానికి పంచాయతీ రాజ్ నుండి టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.4 కోట్లు కేటాయించగా ఎక్సైజ్, పర్యాటకం, సాంస్కృతిక పురావస్తు అప్పటి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఏప్రిల్ 16న శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. పంచాయతీ రాజ్ అధికారులు ఏ ఒక్కరోజు వచ్చి పరిశీలించక పోతున్నారు. మున్సిపల్ కమిషనర్ రాజు అప్పుడప్పుడు వెళ్లి పనులను పరిశీలిస్తున్నామని చెప్తున్నారే తప్ప నాణ్యత విషయంలో కానీ, పనులు జరుగుతున్న తీరుని పరిశీలించడం లేదనేది సత్యం, కొద్ది రోజులుగా జరుగుతున్న పనుల్లో ఇసుక, డస్ట్, మట్టితో కలిపి సిమెంట్ పనులను చేపడుతున్నారు. తద్వారా కొద్ది నెలలకే చేసిన పనుల్లో పగుల్లు వచ్చే అవకాశం ఉంది. ఇదియేగాక గూండ్ల చెరువు కట్టపై ఇనుప రైలింగ్‌ను ఏర్పాటు చేశారు. కానీ సిమెంట్‌కు ఏర్పాటు చేసిన రంధ్రాల్లో రెయిలింగ్ రాకపోవడంతో అడుగు భాగంలో జాయింటింగ్ ఇచ్చారు. ఆ రెయిలింగ్‌కు అడుగు భాగంలో సిమెంట్‌తో మూసి వేస్తారు. గణపతుల నిమజ్జన సమయంలో విపరీతంగా ప్రజలు నిమజ్జనానికి వీక్షించడానికి గూండ్ల చెరువుకు వస్తారు. రైలింగ్ అడుగు భాగంలో జాయింటింగ్ వీడిపోయే ప్రమాదం ఉంది. దాంతో ప్రమాదం సంభవించే అవకాశం ఎక్కువగా ఉంది.

అధికారుల పనితీరుపై ప్రజల ఆగ్రహం

జరుగుతున్న అభివృద్ధి పనులను పంచాయతీ రాజ్ అధికారులు పరిశీలించక పోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయిస్తే పనులను పరిశీలించవల్సిన అధికారులు ఆమ్యామ్యాలు అందుతే చాలు అన్నట్లు ప్రవర్తించడం సరి కాదని, ప్రతీరోజు పనులను పరిశీలించాలని అంటున్నారు. అధికారులు, కాంట్రాక్టర్‌లతో కుమ్మకైతే ప్రజలకు భారీ నష్టం వాటిల్లుతుందని విధులు నిర్వహిస్తున్నా అధికారులు సక్రమంగా నిర్వహించాలని ఆమ్యామ్యాలకు ఆశ పడొద్దని వేడుకుంటున్నారు.

వన మహోత్సవానికి అంతా సిద్ధం

● నాగిరెడ్డిపేట మండలంలోని 25 నర్సరీల్లో లక్ష మొక్కలు నాటేందుకు సిద్ధం ● 83 వేల మొక్కలు నాటే లక్ష్యం


ధర్మారెడ్డిలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రభాకర్ చారి


గోపాల్‌పేట్‌లో నర్సరీని పరిశీలిస్తూ..

నాగిరెడ్డిపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాలంలో మండలంలోని గ్రామ గ్రామాన ముక్కలు నాటేందుకు వన మహోత్సవానికి అన్ని ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. గ్రామపంచాయతీలవారిగా ఏర్పాటు చేసిన నర్సరీలలో మొక్కలను పెంచి ప్రస్తుతం మొక్కలు నాటేందుకు వాటిని సిద్ధంగా ఉంచారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హరిత హారం ద్వారా మొక్కలు నాటి కార్యక్రమాన్ని చేపట్టగా, ప్రస్తుతం వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ వన మహోత్సవంలో భాగంగా వివిధ రకాల నీడ నిచ్చే మొక్కలతోపాటు, పూల మొక్కలు, పండ్ల మొక్కలు వివిధ నర్సరీలలో పెంచి నాటేందుకు అధికారులు సిద్ధం చేశారు. నాగిరెడ్డిపేట మండలంలోని 25 గ్రామ పంచాయతీలో నర్సరీలను ఏర్పాటు చేసి ఒక్కో గ్రామపంచాయతీ నర్సరీలో నాలుగు వేల చొప్పున మొక్కలను పెంచారు. ప్రస్తుతం మండలంలోని నర్సరీ లలో ఒక లక్ష మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నట్టు స్థానిక ఎంపీడీవో ప్రభాకర్ చారి తెలిపారు. ఈ సారి వన మహోత్సవంలో భాగంగా మండలంలో 83 వేల మొక్కలు నాటే లక్ష్యంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని రెండు కొత్త గ్రామ పంచాయితీలతో కలుపుకుని 27 గ్రామ పంచాయతీలు ఉండగా ఒక్కో గ్రామ పంచాయితీ పరిధిలో 2,300 మొక్కల చొప్పున మండలంలో 62,100 మొక్కలు నాటనున్నారు. అలాగే ప్రతీ గ్రా మాల్లో 23 వేల మొక్కలను పంపిణీ చేసి వాటిని అధికారులు నాటించ నున్నారు.

● వన మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు

మండలంలో వన మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు మండల అధికారులు అన్ని చర్యలు చేపడుతున్నారు. నర్సరీలలో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండటంతో ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతామని స్థానిక ఎంపీడీవో ప్రభాకర్ చారి తెలిపారు. గ్రామాల్లో మొక్కలు నాటేందుకు అనువైన ప్రాంతాలను అధికారులు గుర్తిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ప్రాంగణాలు, గ్రామీణ రోడ్ల ప్రక్కన ఖాళీ స్థలాలను ఎంపిక చేసి మొక్కలు నాటనున్నారు. ఎంపిక చేసిన స్థలాల్లో మొక్కలు నాటించడంతో పాటు వాటిని సంరక్షించేలా అవసరమైన ప్రణాళికలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. నాటిన ప్రతి మొక్క బ్రతికిలా తగు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ప్రభాకర్ చారి తెలిపారు.

గంగమ్మ వాగు బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేది ఎప్పుడు..!?


రామారెడ్డి గంగమ్మ వాగు బ్రిడ్జి పనులు మధ్యలో నిలిచిపోవడంతో అదనపు రోడ్డు ఏర్పాటు చేసిన రోడ్డుపై లారీ బోల్తా పడిన దృశ్యం (ఫైల్)


రోడ్డుపై పెద్ద వాహనాలను తీసుకువెళుతున్న దృశ్యం


మధ్యలో నిలిచిపోయిన గంగమ్మ వాగు బ్రిడ్జి పనులు

● రామారెడ్డి మండల కేంద్రంలో గంగమ్మ వాగు బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలి
● త్వరగా పూర్తి చేయాలని కోరుతున్న ప్రజలు

రామారెడ్డి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలో గంగమ్మ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తికానందున రాకపోగలరని మండల ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలం ప్రారంభమైన బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కామారెడ్డి జిల్లా కేంద్రానికి బ్రిడ్జి వారధిగా ఉన్నందున 20 గ్రామాల ప్రజలు ఈ బ్రిడ్జిపై నుంచి కామారెడ్డి జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం రావడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో రైతులకు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున వర్షాకాలంలో ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే బ్రిడ్జి నిర్మాణం పూర్తిగా చేపట్టి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు పట్టించుకోని వెంటనే స్పందించి బ్రిడ్జి పనులను పూర్తి చేయించాలని కోరారు. ఈ రహదారి గుండా శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి, శ్రీ కాలభైరవ స్వామి ఆలయాలకు వేల మంది భక్తులు వస్తారని, ప్రజలను రైతులను దృష్టిలో పెట్టుకొని పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుకుంటున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రం భీంగల్, ధర్పల్లి, సిరికొండ, డిచ్‌పల్లి, తదితర మండలాల ప్రజలకు ఈ బ్రిడ్జి గుండా హైదరాబాద్‌కు వెళ్తారని ప్రజలు ఆరోపిస్తున్నారు. డీఏవో సంతోషి అధికారి లేకపోవడంతో ఈఈ ఆదేశాల మేరకు ఇంకో అధికారికి వినతి అందజేశారు. గత ప్రభుత్వం మూడు కోట్ల 8 లక్షల రూపాయలతో బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభించారు. మొదటి నుంచి ఇంతవరకు బిల్లులు రాకపోవడంతో విధులు నిర్వహించి మధ్యలో కాంట్రాక్టర్ నిరసన వ్యక్తం చేస్తూనే నిరసిస్తూ ఒక్కసారిగా వదిలివెళ్లారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి పెట్టి బ్రిడ్జి పనులను వెంటనే నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల మోత

(5వ పేజీ తరువాయి)

విద్యాశాఖాధికారులకు సమర్పించారు. ఎవరైన ప్రశ్నిస్తే ఆ వివరాలను అందించి వీరి నిర్ణయం మేరకే ఫీజులు నిర్ణయించామని చెబుతున్నారు. కమిటీలో ఉన్న ఒకరిద్దరికి తెలియజేసి మిగిలిన వారివి తమకు నచ్చిన పేర్లు పెడుతున్నారు. రోజు కూలీ నుంచి ఉన్నత ఉద్యోగుల దాకా తమ పిల్లలను పేరున్న ప్రైవేట్ పాఠశాలల్లో చదివించాలని తపన పడటం సహజం. తల్లిదండ్రుల ఆరాటాన్ని యాజమాన్యాలు సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. గడిచిన ఐదేళ్లలో ఫీజుల మోత పది రేట్లు పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే 20 శాతం నుంచి 30 శాతం పెంచేశారు. విద్యార్థుల ఇబ్బందులు తొలగించేందుకు తాము అండగా నిలుస్తామని పలు సందర్భాల్లో పేర్కొంటున్న కొన్ని విద్యార్థి సంఘాలు ప్రైవేట్ యాజమాన్యాలు, కొందరు విద్యాశాఖాధికారుల కనుసన్నల్లో పని చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు అడ్డగోలు ఫీజులు వసూలు చేస్తే విద్యార్థి సంఘాల నాయకులు, విద్యాశాఖాధికారుల దృష్టిలో పడితే ఇబ్బందులు పడుతామని భయం ఉండేది. కానీ ఇప్పుడు విద్యార్థి సంఘాల్లో పోరాటం చేసి పరిష్కారం చూపే నాయకులే కరువయ్యారు. దీంతో ప్రైవేట్ దోపిడీని అడ్డుకునే వారు లేక విద్యార్థుల తల్లిదండ్రుల ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఆదాయంలో 40 శాతం పిల్లల చదువులకే ఖర్చు అవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు.

ఉచిత సీట్ల కేటాయింపు ఏదీ?

పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లను జిల్లాలోని ఏ ఒక్క ప్రైవేట్ పాఠశాల కేటాయించడం లేదు. ప్రైవేట్, కార్పొరేట్ స్థాయి పాఠశాలలు బహిరంగంగానే అడ్మిషన్ ఫీజు వసూలు చేస్తున్నాయి. ఇది నిబంధనలకు విరుద్ధమైనా అడిగే వారే లేరు. పాఠశాల అభివృద్ధి, సిబ్బంది సంక్షేమం, క్రీడలు, పరీక్ష ఫీజు, సాంస్కృతిక కార్యక్రమాల పేరిట యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. జిల్లా ఏర్పడిన నాటి నుంచి ఇంత వరకు అధికారుల ఆధ్వర్యంలోని కమిటీ కూర్చొని చర్చించకపోవడం గమనార్హం. ప్రైవేట్ బడుల్లో తప్పని సరిగా డీఈడీ, బీఈడీ ఆపై చదువులు చదివిన వారినే ఉపాధ్యాయులుగా నియమించాలి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి సౌకర్యాలు కల్పించాలి. చాలా వరకు ఈ నిబంధనలు ఏ పాఠశాలలోనూ లేవు.

నర్సరీకి రూ.15 వేల నుంచి రూ.25 వేలు

పాఠశాల స్థాయిని బట్టి విద్యార్థుల నుంచి ఫీజులను వసూలు చేస్తున్నారు. ప్రాధాన్యత తక్కువ ఉన్న పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీకి రూ.10 వేలు, ఓ మోస్తరు పాఠశాలలో రూ.12 వేలు డిమాండ్ అధికంగా ఉన్న పాఠశాలలో 15 వేల నుంచి రూ.25 వేల వరకు వసూలు చేస్తున్నారు. పదో తరగతి విద్యార్థులకు రూ.60 వేల పైనే తప్ప తక్కువ లేదు. ఇక యూనిఫాం, దుస్తులు, పుస్తకాలు, షూస్, టై, బెల్టులు కమీషన్ ఇచ్చే దుకాణాల్లో లేదంటే నేరుగా పాఠశాలల్లోనే అమ్మకాలు జరుపుతున్నారు. పాఠశాల పేర్లతో ముద్రించినవి కావడంతో తల్లిదండ్రులు అధిక ధర చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోంది.

కల్వరాల్ వద్ద రోడ్డుప్రమాదం : ఒకరి మృతి

సదాశివనగర్, భిక్కనూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సదాశివనగర్ మండలంలోని కల్వరాల్ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. భిక్కనూరు మండలకేంద్రానికి చెందిన బత్తుల రాంచంద్రం(50) ఆదివారం నిజామాబాద్‌లో శుభకార్యానికి బైక్‌పై వెళ్లి హాజరై తిరిగి భిక్కనూరుకు వస్తుండగా కల్వరాల్ వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనగా అతడికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో అతడిని స్థానికులు అంబులెన్స్‌లో కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. రాంచంద్రం మృతితో భిక్కనూరులో విషాదచాయలు అలుముకున్నాయి. మృతుడి కొడుకు ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ మేరకు సదాశివనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాల భవనాలకు పెయింటింగ్



అంగన్‌వాడీ కేంద్రానికి పెయింటింగ్ వేసిన దృశ్యం

ఎల్లారెడ్డి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సబ్దాల్‌పూర్ గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ ప్రాథమిక పాఠశాల భవనాలకు అదే గ్రామానికి చెందిన దాత కాంగ్రెస్ పార్టీ మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జిలకర సత్యనారాయణ తన సొంత ఖర్చులు సుమారు 18 వేలతో పెయింటింగ్ వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన చిన్నారులు విద్యార్థుల చదువుతున్న పాఠశాలకు చాలా సంవత్సరాల క్రితం వేసిన పేయింట్ చెరిగిపోవడంతో విద్యార్థుల బాగుకోసం పెయింటింగ్ వేయించినట్లు తెలిపారు. గతంలో కూడా పాఠశాలకు బెంచీలు కూడా అందించారు. దీంతో గ్రామస్తులు సత్యనారాయణను అభినందించారు.



హర్షిత్ యాదవ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే


నవోదయకు ఎంపికైన విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే

రాజంపేట, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న హర్షిత్ యాదవ్ ఇటీవల జవహర్ నవోదయ పాఠశాలలో అడ్మిషన్ పొందిన సందర్భంగా ఆదివారం కామారెడ్డి ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెంకట రమణరెడ్డి అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి నవోదయలో సీటుపొందడం సంతోషకరమని తెలిపారు. అన్ని ప్రభుత్వపాఠశాలల్లో ఉపాధ్యాయులు దృష్టిసారిస్తే విద్యార్థులు ఇలా అనేక విద్యాసంస్థల్లో సీట్లు సాధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో చోరీలను నివారించవచ్చు

మాచారెడ్డి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో దోపిడీ దొంగతనాలను నివారించవచ్చునని మాచారెడ్డి ఎస్సై అనిల్ అన్నారు. ఆదివారం పాల్వంచ మండలంలోని బండ రామేశ్వర్‌పల్లి గ్రామంలో నాలుగు సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతికదలిక సీసీ కెమెరాలో నిక్షిప్తమై ఉంటుందని, దీంతో చోరీలు జగిగినప్పుడు అనుమానాస్పద వ్యక్తులు సంచరించినప్పుడు సీసీ కెమెరాల్లో రికార్డైనా వాటి ద్వారా వాటిని తొందరగా ఛేదించవచ్చన్నారు. ఆలయాల్లో సైతం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం ఆన్‌లైన్‌మోసాలు, సైబర్ నేరాలు, తదితర అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పోలీసుసిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



రాచూరి కావ్య

మాచారెడ్డి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భవానీపేట్ కిసాన్‌నగర్‌కు చెందిన రాచూరి కావ్య అదృశ్యమైనట్లు ఎస్సై అనిల్ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కావ్య శనివారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో యువతి తండ్రి శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



కంచర్లలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్న దృశ్యం



జిల్లా కేంద్రంలో కలుసుకున్న పూర్వవిద్యార్థులు

భిక్కనూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని కంచర్ల గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల 2004-05 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కుటుంబసమేతంగా సహా ఆదివారం ఇసన్నపల్లి మల్లన్న ఆలయం వద్ద పూర్వవిద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు ఒకరినొకరు క్షేమసమాచారాన్ని తెలుసుకుని పాతజ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ బ్యాచ్ విద్యార్థులం దరందరం ఇలా కలుసుకోవడం సంతోషంగా ఉందని, తాము చదువుకున్న గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి ఇకనుంచి తామంతా కృషిచేస్తామన్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి.

కామారెడ్డిటౌన్ : విద్యను బోధించి భవిష్యత్తుకు మార్గదర్శకులైన ఉపాధ్యాయులను, తమ చిన్ననాటి స్నేహితులను కలుసుకుని ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ 2009-2010 విద్యాసంవత్సరంలో జిల్లా కేంద్రంలోని నాగార్జున హైస్కూల్‌లో చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యతో పాటు మంచి నడవడికను నేర్పిన గురువులను సత్కరించుకుని తోటిస్నేహితులతో ప్రస్తుతం వారు జీవిస్తున్న తీరును వివరించుకుంటూ ఎంతో ఆనందంగా గడిపారు.

దోమకొండ : దోమకొండ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల 1984-85 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులను పూర్వవిద్యార్థులను సన్మానించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ మేరకు ఒకరినొకరు క్షేమసమాచారాలను తెలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటు ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఈవో జలపతిరావు, రిటైర్డ్ డైట్‌లెక్చరర్ మహేష్‌బాబు, రిటైర్డ్ హెచ్‌ఎం హన్మంత్‌రావు, ఉపాధ్యాయులు రాజలింగం, నారాయణ, పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



దోమకొండలో..

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైంది



ప్రధానోపాధ్యాయులిని సన్మానిస్తున్న సహ ఉపాధ్యాయులు

తాడ్వాయి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని మండల విద్యాధికారి రామస్వామి అన్నారు. ఈయన ఆదివారం మండలకేంద్రంలో ప్రధానోపాధ్యాయులు రాజాగౌడ్ పదవీవిరమణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి మాజీ ఏఎంసీ శ్యామ్‌రావు, మాజీసర్పంచ్ సంజీవ్, మాజీ వైస్ ఎంపీపీ ముదాం నర్సింలు, వీడీసీ అధ్యక్షులు మేకలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని గ్రామీణస్థాయిలో బలోపేతం చేయాలి

● జిల్లా కాంగ్రెస్ యువజన ఇన్‌చార్జ్ అమృత



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా యువజక కాంగ్రెస్ ఇన్‌చార్జ్

పిట్లం జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గ్రామస్థాయిలో ప్రజలందరికీ అర్థమయ్యేలా వివరించి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేయాలని జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అమృత అన్నారు. ఆదివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో జిల్లా యువజన ఇన్‌చార్జ్ అధ్యక్షతన జుక్కల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి జుక్కల్ నియోజకవర్గ యవజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ పార్టీ బలోపేతం, యువతలో చైతన్యం పెంపు, మండలస్థాయిలో కార్యకర్తల సమన్వయంపై సమీక్ష సమావేశంలో వివరించారు. కార్యక్రమంలో జిల్లా యువజన సంఘం అధ్యక్షులు మధుసుధన్‌రెడ్డి, జుక్కల్ నియోజకవన్గ యువజన సంఘం అధ్యక్షులు ఇమ్రోజ్, జిల్లాతో పాటు నాయకులు పాల్గొన్నారు.

రోటరీక్లబ్ ఆఫ్ కామారెడ్డికి అవార్డులు



అవార్డులు అందుకుంటున్న రోటరీక్లబ్ సభ్యులు

కామారెడ్డిటౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ ఆఫ్ కామారెడ్డికి సామాజిక సేవలు అందించినందుకు 2024-25 సంవత్సరానికిగాను అవార్డులు వచ్చాయి. హైదరాబాద్‌లో డిస్ట్రిక్ గవర్నర్ శరత్ చౌదరి, అసిస్టెంట్ గవర్నర్ జైపాల్‌రెడ్డి, కామారెడ్డి క్లబ్ అధ్యక్షుడు రాజ నర్సింహరెడ్డిలు అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో రోటరి యన్స్ శ్రీశైలం, కాశీనాథం, రాజేష్‌శంకర్, సుధాకర్‌రావు, సబ్బని కృష్ణహరి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇలేగావ్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ

మద్నూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : డోంగ్లి మండలంలోని ఇలేగావ్ గ్రామానికి బీటీరోడ్డు నిర్మాణానికి గాను రాష్ట్రప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో సోమవారం జుక్కల్ ఎమ్మెల్యేతోట లక్ష్మీకాంతారావు రోడ్డునిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్లు కాంగ్రెస్ నాయకులు వెల్లడించారు. మారుమూల గ్రామమైన ఇలేగావ్ గ్రామానికి మదన్‌హిప్పర్గా నుంచి 1.80 కిలో మీటర్ల రోడ్డుకు రూ. 2.20 కోట్ల నిధులు విడుదల చేసిన ట్లు వారు వెల్లడించారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థికి సన్మానం



ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థికి సన్మానిస్తున్న పెన్షనర్స్

మద్నూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన హరితేజ అనే విద్యార్థికి ట్రిబుల్ ఐటీకి రాష్ట్రస్థాయి 210 ర్యాంకు సాధించి ముంబాయిలోని ట్రిబుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థికి మద్నూర్ తాలూకా పెన్షనర్స్ అసోసియేషన్ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఆదివారం మండలకేంద్రంలోని పెన్షనర్స్ కార్యాలయంలో జిల్లా తాలూకా పెన్షనర్స్ ఉద్యోగుల సమక్షంలో విద్యార్థికి సన్మానించారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ తాలూకా అధ్యక్షులు గంగారాం మాటాడుతూ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించడం వారి ప్రతిభకు నిదర్శనమని, అటువంటి వారిని ప్రోత్సహించిన ట్లయితే మరింత మంది విద్యార్థులు చదువులో ఉన్నతస్థాయికి ఎదుగుతారని గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లాపెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మారుతి, తాలూకా పెన్షనర్స్ రామారావు పాల్గొన్నారు.

సహకార సంఘం ద్వారా 80 వేల 720 క్వింటాళ్ల జొన్నల కొనుగోళ్లు

● సీఈవో సందీప్



కొనుగోలు కేంద్రంలో తూకానికి సిద్ధంగా ఉన్న జొన్నలు (ఫైల్)

పెద్ద కొడప్‌గల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పెద్దకొడప్‌గల్ సహకార సంఘం తరపున మార్క్‌ఫెడ్ ద్వారా నిర్వహించిన జొన్నల కొనుగోలు కేంద్రంలో 80 వేల 720 క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేసినట్లు సీఈవో సందీప్ తెలిపారు. ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన జొన్నకొనుగోలు కేంద్రం పెద్దకొడప్‌గల్‌లో ఉండగా మండలంలోని సుమారు 2596 రైతుల నుంచి 80 వేల 720 క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేశామని తెలిపారు. ఇందుకు గాను 27 కోట్ల 21 లక్షల 9 వేల 479 రూపాయలు కాగా, నేటి వరకు 2215 మంది రైతులకు సంబంధించి 23 కోట్ల 54 లక్షల 59 వేల 934 రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. మిగతా వారి రైతుల ఖాతాల్లో కూడా ఈ నెలాఖరు వరకు జొన్నల డబ్బులు జమ చేస్తామని సీఈవో తెలిపారు. మండలంలో జొన్నల కొనుగోలును సకాలం లో పూర్తిచేశామని, ఇందుకు సహకరించిన రైతులు, అధికారులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి కృషి : కామారెడ్డి ఎమ్మెల్యే



అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న దృశ్యం

దోమకొండ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని భూలక్ష్మి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి అన్నారు. ఆదివారం ఆలయంలో తన సొంత నిధులతో చేసిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు భూపాల్, జిల్లా కార్యదర్శి సంతోష్‌రెడ్డి, కార్యవర్గసభ్యుడు రవీందర్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, మనోజ్‌కుమార్, శ్రీనాథ్, రవి, లక్ష్మణ్, కిషోర్ పాల్గొన్నారు.

'కడీలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'



భిక్కనూరులో మాట్లాడుతున్న అఖిలపక్షం నాయకులు

భిక్కనూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతువేదిక సమీపంలో వీడీసీ స్థలంలో ఏర్పాటు చేసిన కడీలను ధ్వంసం చేసిన వారిపై కేసునమోదు చేసి చర్యలు తీసుకోవాలని భిక్కనూరు అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ధ్వంసం చేసిన కడీలను అఖిలపక్షం నాయకులు పరిశీలించి మాట్లాడారు. వీడీసీకి సంబంధించిన స్థలంలో కడీలను ఏర్పాటు చేస్తే గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని ఆరోపించారు. దీనిపై కేసు నమోదు చేసి ధ్వంసం చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు లింబాద్రి, తునికి వేణు, మహిపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, భూమయ్య, రవీందర్, బస్వయ్య, లక్ష్మణ్, ప్రభాకర్, డప్పు రవి, సాజిద్, నర్మల రాంచంద్రం, సుబ్బా రావు, ఆంజనేయులు, మల్లేషం, తదితరులు పాల్గొన్నారు.

ఊరడమ్మ వద్ద చెత్త తొలగింపు



భిక్కనూరు ఊరడమ్మ వద్ద చెత్తను తొలగించి శుభ్రం చేసిన దృశ్యం

భిక్కనూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఊరడమ్మ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ పక్కన పేరుకుపోయిన చెత్తను ఆదివారం గ్రామపంచాయతీ సిబ్బంది తొలగించారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న పిచ్చిచెట్లు, గడ్డిని సిబ్బంది తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఈవో మహేష్‌గౌడ్ మాట్లాడుతూ చెత్తను బయట వేయకుండా ప్రతిరోజు వచ్చే చెత్త ట్రాక్టర్‌లోనే వేయాలని కోరారు. అనంతరం కాలనీవాసులు మాట్లాడుతూ చెత్తను, పిచ్చిచెట్లు, గడ్డిని తొలిగించిన ఈవోకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఏఎస్‌ఆర్ ఫౌండేషన్ సభ్యులు

జుక్కల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఏఎస్‌ఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శిగా సేవలు అందించిన జుక్కల్ మండలం పడంపల్లి గ్రామానికి చెందిన వాగ్మరి బాలరాజ్ ఇటీవల రోడ్డుప్రమాదంలో మరణించాడు. దీంతో ఆదివారం ఆయన కుటుంబాన్ని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యాల సంతోష్, ఫౌండేషన్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబానికి తనవంతుగా రూపాయలు ఐదువేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఆర్ ఫౌండేషన్ నాయకులు రోటే సాయిలు, బక్రె అనిల్, కాందేవార్ శ్రీకాంత్, నాగ్‌నాథ్ ఉన్నారు.

'శిలాఫలకం గద్దెను తిరిగి నిర్మించాలి'



కూల్చివేసిన గద్దెను పరిశీలిస్తున్న నాయకులు

సదాశివనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నంది విగ్రహం వద్ద కూల్చివేసిన గద్దెను తిరిగి నిర్మించాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని మండల బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. మండలకేంద్రంలో కూల్చివేసిన గద్దెను ఆదివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలకేంద్రంలో రోడ్డువెడల్పు కార్యక్రమం చేపట్టడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రోడ్డు వెడల్పు చేసే సందర్భంలో అవసరం లేకపోయినప్పటికీ గద్దెను కూల్చివేశామని ఆగ్రహం వ్యక్తం చేశారు. గద్దెను కూల్చిన వారు తిరిగి నిర్మించాలని లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

టీపీసీసీ ప్రధాన కార్యదర్శిని కలిసిన సభ్యులు

కామారెడ్డిటౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని 17వ వార్డు ఆంజనేయ స్వామి ఆలయసభ్యులు ఆదివారం టీపీసీసీ ప్రధానకార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధానకార్యదర్శి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిని అంచెలంచెలుగా పెంచుతూ రావాలని భక్తులకు సరైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. దైవ సేవలో తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు చుక్కరావు, స్నేహపూరికాలనీ అధ్యక్షుడు రమేష్, ప్రగతినగర్ అధ్యక్షుడు ప్రభాకర్, శశిధర్, వినోద్‌రెడ్డి, ప్రవీణ్, చిన్నరాజిరెడ్డి, పెద్దరాజిరెడ్డి, రవి, శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



టీపీసీసీ ప్రధానకార్యదర్శి సన్మానిస్తున్న ఆలయసభ్యులు

మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షించిన నాయకులు



మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు

తాడ్వాయి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాని నరేంద్ర మోడీమన్‌కీ బాత్ 123వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని తాడ్వాయి మండల బీజేపీ నాయకులు వీక్షించారు. మండలంలోని సంగోజివాడి గ్రామంలో 152వ బూత్‌లో జిల్లా అధ్యక్షులు ఆధ్వర్యంలో వీక్షించారు. కార్యక్రమంలో భారతీయజనతా పార్టీ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు నీలం చిన్నరాజులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ రావు, ఎల్లారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ లింగారావు, తాడ్వాయి మండల అధ్యక్షులు సంతోష్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నర్సింలు, మండల ఉపాధ్యక్షులు ధర్మపురి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు దత్తాత్రేయ, బూత్‌అధ్యక్షులు, బీజేపీ నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.

రామారెడ్డి : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం మన్‌కీబాత్ కార్యకమాన్ని నిర్వహించారు. రామారెడ్డి మండలంతో పాటు రెడ్డిపేట్, మద్దికుంట, పోసానిపేట్, గిద్ద, ఉప్పలవాయి, ఇసన్నపల్లి, కన్నాపూర్ తదితర గ్రామాల్లో, తండాల్లో ప్రధానమంత్రి మోదీ ప్రసంగాన్ని భారతీయ జనతా పార్టీ నాయకులు వీక్షించారు.

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	170
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

